క్లస్టర్ కష్టాలు..!

కర్నూలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ దేశంలో తొలి క్లస్టర్ విశ్వ విద్యాలయం అది. గత వైసీపీ ప్రభుత్వం అలసత్వం విద్యార్థులను శాపంగా మారింది. పాలకుల నిర్లక్ష్యం నీడలో మగ్గిపోతుంది. కష్టాల్లో మగ్గుతున్న క్లస్టర్ వర్సిటీని బాగు చేయండి..! అంటూ విద్యార్థులు ఏకరువు పెడుతున్నారు. కర్నూలు నగర శివారులో జగన్నాథగట్టుపై 50.5 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత భవనాలు నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిధులు ఇవ్వకపోవడంతో పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. అంతేకాదు అప్పటి ప్రభుత్వంలో నంబర్-2గా చెప్పుకునే ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఓ మంత్రి అండదండలతో నిబంధనలు తుంగలో తొక్కేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు తెలియకుండానే మ్యాపింగ్ చేసి అక్రమంగా బిల్లులు చెల్లింపులు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఆనాటి మంత్రి పాత్ర ఉందని సమాచారం. అప్పుడే గవర్నర్, సీఎంవో, ఆర్థిక ప్రిన్సిపల్ సెక్రెటరీలకు ఫిర్యాదులు వెళ్లాయి. సీఎం చంద్రబాబు, రాష్ట్ర మానవవనరులు అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ జోక్యం చేసుకొని కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ కష్టాలు తీర్చాలి.. నిధులు మంజూరు చేసిన అసంపూర్తి పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

(మిగతా 6లో..)





కర్నూలు నగర శివారులో జగన్నాథ గట్టుపై అసంపూర్తిగా క్లస్టర్ యూనివర్సిటీ భవనాలు

- జగన్నాథగట్టుపై 50.5 ఎకరాలు కేటాయింపు
- రూ.139 కోట్లతో శాశ్వత భవనాలు నిర్మాణాలకు శ్రీకారం
- వైసీపీ హయాంలో ఓ మంత్రి అండతో అడ్డగోలు చెల్లింపులు
- రిజిస్ట్రార్‌కు తెలియకుండానే మ్యాపింగ్
- నిబంధనలకు విరుద్ధంగా రూ.36 కోట్లు చెల్లింపులు
- క్లస్టర్ వర్సిటీ ప్రగతిపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి



ధర్మపథంలో కళాకారుల ప్రదర్శన

శ్రీశైలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల దర్శనార్థం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ ఉత్తర మాడవీధిలో, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద భక్తులు దీపారాధనలను చేశారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదిలా ఉండగా ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సాయంత్రం మహబూబ్‌నగర్‌కి చెందిన సాయికృపా కూచిపూడి కళాక్షేత్రం బృందం చేపట్టిన సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



ధర్మపథంలో కళాకారుల నృత్యప్రదర్శన

వేగంగా విస్తరణ



నేతాజీనగర్‌లో తొలగిస్తున్న ఆక్రమణలు

ఆత్మకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రహదారుల విస్తరణకు మున్సిపాలిటీ అధికారులు వేగం పెంచారు. ఇప్పటికే పాతబస్టాండ్, కేజీరోడ్డు తదితర ప్రధాన రహదారులపై ఆక్రమణలను తొలగించగా, మంగళవారం నేతాజీనగర్‌లో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. యజమానులకు నోటీసులు ఇవ్వగా, కొందరు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించగా, మరికొందరు నిర్లక్ష్యం వహించారు. మంగళవారం ఉదయాన్నే మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో రేకుల షెడ్లు, మెట్లు, ఇతర నిర్మాణాలను తొలగించారు. తొలగించిన వ్యర్థాలను ట్రాక్టర్లలో తరలించారు. అలాగే కళాంజలి ప్రింటర్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం, పాతబస్టాండ్, నేతాజీనగర్, తిక్కయ్యస్వామిదర్గా, తోటగేరి, గాంధీపార్క్, పెద్దబజారు, అమ్మవారిశాల, కొత్తపేట మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు మినీ రింగ్ రోడ్డు ఏర్పాటు కోసం మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మార్క్‌ఫెడ్ జిల్లా అధికారిగా హరినాథ్




నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ జిల్లా అధికారిగా హరినాథ్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మార్క్‌ఫెడ్ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

తుంగభద్రకు 192 టీఎంసీలు

కర్నూలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయంలో 192 టీఎంసీల వరద వినియోగించుకోవచ్చని మంగళవారం జరిగిన టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ అంచనా వేసింది. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) వాటాగా 21.736 టీఎంసీలు, కేసీ కెనాల్ వాటాగా 9.057 టీఎంసీలు చొప్పున కర్నూలు జిల్లాకు 30.793 టీఎంసీలు కేటాయించారు. అనంతపురం జిల్లాకు హెచ్చెల్సీ కాలువకు 29.434 టీఎంసీలు కేటాయింపులు చేశారు. టీబీపీ బోర్డు ఇన్‌చార్జి ఎస్ఈ నీలకంఠరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కర్నూలు జిల్లా ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డి వర్చువల్ ద్వారా హాజరయ్యారు.

మిగతా 7లో...

- టీబీపీ డ్యాంలో 2024-25 నీటి చేరికపై తుది అంచనా
- ఎల్లెల్సీ, కేసీ వాటాగా 30.793 టీఎంసీలు
- అనంతపురం జిల్లాకు హెచ్చెల్సీ వాటా 29.434 టీఎంసీలకు అంచనా
- టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశం




యురేనియం తవ్వకాలు
వైసీపీ అభూతకల్పన 7
పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

అరటితో అద్భుతాలు 6
తోటల సాగులో స్ఫూర్తిగా సివిల్ ఇంజనీర్

మద్యం.. ఇసుక జోలికి వెళ్లవద్దు!

- ప్రజాసేవకే అంకితమవ్వాలి
- కార్యకర్తల త్యాగాలు వల్లే గెలిచాం
- వారిని నిర్లక్ష్యం చేయకండి
- ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే సహించేది లేదు
- జిల్లా ఎమ్మెల్యేల సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



కర్నూలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యేలు అనే అహం వీడండి.. కార్యకర్తల త్యాగాల వల్లే గెలిచామనే వాస్తవాన్ని మరవద్దు. కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకండి. ప్రజలతో ఉంటూ ప్రజాసేవకే అంకితమవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జమిలి ఎన్నికలు వచ్చినా మనం సిద్ధంగా ఉండాలి. ప్రభుత్వం ఉచిత ఇసుక, మద్యం పాలసీలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. వాటి జోలికి వెళ్లవద్దు..' అంటూ టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబు జిల్లా ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బడ్జెట్‌తో పాటు వివిధ అంశాలపై టీడీపీ ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు శిక్షణ ఇచ్చారు. ఓ వైపు ప్రభుత్వ విధానాలు వివరిస్తూ మరో వైపు ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేస్తూనే.. ఇసుక, మద్యం వ్యాపారాల్లో అడుగు పెట్టి పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని, అలా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఘాటుగా హెచ్చరించారు.

● ఇసుక, మద్యం వ్యాపారాల్లో జోక్యం వద్దు

ఉచిత ఇసుక, మద్యం పాలసీలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. గత ప్రభుత్వం ఇసుక దోపిడి చేసింది. సామాన్యులకు ఉపాధి లేకుండా చేసింది. అదే క్రమంలో మద్యం పాలసీలని భ్రష్టుపట్టించిన సంగతి తెలిసిందే. ఇసుక, మద్యం విషయంలో మనం నిక్కచ్చిగా ఉందాం. ఏ పల్లెల్లోనైనా వంకలు, వాగుల్లో ఇసుకను ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో కావాల్సిన వాళ్లు ఉచితంగా తీసుకెళ్లవచ్చు. అదే క్రమంలో మద్యం పాలసీని కూడా పక్కాగా అమలు చేస్తున్నాం. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, వారి పేరు చెప్పుకొని పార్టీ నాయకులు ఎవరు కూడా జోక్యం చేసుకోవద్దు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో కొందరు ఎమ్మెల్యేలు ఉచిత ఇసుక, మద్యం అమ్మకాల్లో జోక్యం ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఏ ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారో నిఘా వర్గాల ద్వారా సమాచారం ఉంది. ఈ రోజు నుంచి మారకపోతే పాత చంద్రబాబు చూస్తారు.

● ప్రజా సేవకే అంకితం అవ్వాలి

సేవ చేస్తారనే మిమ్మల్ని ప్రజలు ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్నారు. వారి మధ్యనే ఉంటూ ప్రజా సేవకు అంకితం కావాలి. పార్టీ కార్యకర్తలు త్యాగాలు చేస్తేనే విజయం సాధించామన్న వాస్తవాన్ని ఏ ఒక్కరూ మర్చిపోవద్దు. కార్యకర్తల అభ్యున్నతి కోసం పని చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని విస్మరించవద్దు. కష్టపడిన కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇస్తున్నాం. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కూడా ఇదే విధానం అమలు చేయాల్సిందే.

● కర్నూలు జిల్లాలో సమస్యలు వాస్తవమే

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇటు పార్టీలోనూ.. అటు గ్రామాల్లోనూ పలు సమస్యలు ఉన్నాయి. వాటిపై నా స్థాయిలోనే కాకుండా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కూడా వారిస్థాయిలో కూడా ఫోకస్ పెట్టాలి. అప్పుడే ప్రజలు మళ్లీ ఆదరిస్తారు. కర్నూలు పశ్చిమాన తాగునీటి సమస్య, కరువు, వలసలు ఉన్నాయి. వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఏమిచేయాలో ఆలోచిస్తున్నాం. వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే కొంతవరకైనా వలసలు ఆగుతాయి. ఆ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కృషి చేద్దాం. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాం. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నాయకుల మధ్య దూరం పెరుగుతోంది. అది మంచి పద్ధతి కాదు.. మేము ఎమ్మెల్యేలమని అహంకారం వీడండి.. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ముందుకు సాగండి. మామూలుగా అయితే 2029లో సార్వత్రిక ఎన్నికలు వస్తాయి. జమిలి ఎన్నికలకు వెళ్లేందుకు కేంద్రం సిద్ధం అవుతుండడంతో ఏడాది ముందే ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ రోజు నుంచి సన్నద్ధం కావాలి.. అని సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేలకు సూచించారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి -కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాలలో శంకుస్థాపన చేసిన 1026 సీసీ రోడ్ల నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సీసీరోడ్ల నిర్మాణపనులపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలో 1023 సీసీరోడ్లు, 3బీటీ రోడ్లును దాదాపు 3కోట్లతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారన్నారు. వీటిని త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. ఆళ్లగడ్డలో 240 రోడ్ల నిర్మాణ పనులకు గాను 46 పనులు గ్రౌండింగ్ అయ్యాయని, నంద్యాలలో 101 పనులకు 20 పనులు, పాణ్యం నియోజకవర్గంలో 71 పనులకుగాను 24 పనులు, శ్రీశైలంలో 162 పనులకు గాను 34 గ్రౌండింగ్, డోన్‌లో 64 పనులకుగాను 23 పనులు, నందికొట్కూర్‌లో 236 పనులకు 56 పనులు గ్రౌండింగ్ అయ్యాయని ఈ నిర్మాణ పనులు పూర్తికావాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 23 వ తేదీన ప్రజాప్రతినిధులచే ప్రారంభోత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సీసీ రోడ్ల నిర్మాణ పనులను చాలెంజ్‌గా తీసుకొని లక్ష్యాన్ని మించి అధిగమించాలని కలెక్టర్ ఆదేశించారు.

సంక్షేమ వసతిగృహాలపై సమీక్ష :

నంద్యాల జిల్లాలోని 86 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని, దీనితోపాటు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి వసతి గృహాల సంక్షేమ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులోని సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బీసీ వెల్ఫేర్ అధికారి ముస్తక్ అహమ్మద్, ఐటీడీఏ ఏపీఓ వెంకటశివప్రసాద్, వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.




ఇంజనీరింగ్ అసిస్టెంట్ల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్

నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించే ఏఈలపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం నంద్యాల డివిజన్ విద్యుత్ కార్యాలయంలో డీఈఈ, ఏఈలతో ఎస్ఈ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ఎస్ఈలు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యుత్ బకాయిలను వంద శాతం వసూలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా పలు చోట్ల ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ఏఈలపై ఉందన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఈఈలు శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, మహేశ్వరరెడ్డి, నంద్యాల టౌన్ డీఈఈ రమేష్‌కుమార్, ఏఈలు రామయ్య, శ్రీనివాసులు, నాగరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులతో చర్చిస్తున్న ఎస్ఈ సుధాకర్‌కుమార్

వ్యవసాయం


అరటి తోటను పరిశీలిస్తున్న పరదేశి మహేష్

అరటితో అద్భుతాలు

డోన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

ఆయన చదివింది సివిల్ ఇంజనీర్.. ఉన్నత విద్య అభ్యసిం చినప్పటికీ రైతుబిడ్డగా మారిపోయారు. వ్యవసాయంపై ఇష్టంతో ఆ రంగాన్ని ఎంచుకున్నారు. అరటి సాగులో భళా అనిపిస్తున్నారు. సెమీ ఆర్గానిక్ ఎరువులతో అరటి తోటలను సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. అరటిపై పరిశోధన చేస్తూనే వినూత్న ఆలోచనలతో ఉప ఉత్పత్తులు సాధిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఎంతో మంది రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

డోన్ పట్టణానికి చెందిన సివిల్ ఇంజనీర్ పరదేశీ మహేష్ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ డోన్ నియోజకవర్గ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పట్టణంలోని కొత్తపేటలో నివాసం ఉంటున్న పరదేశీ మహేష్ 2000 సంవత్సరంలోనే సివిల్ ఇంజనీర్ పూర్తి చేశాడు. ఇంజనీర్‌గా ఉద్యోగం చేయాలన్న ఆలోచన పక్కన పెట్టి చిన్నప్పటి నుంచే వ్యవసాయంపై మక్కువతో మహేష్ అందులో అడుగు పెట్టారు. మొదట డోన్ సమీపంలో తన పొలంలో కూరగాయలను సాగు చేశారు. ఆ తర్వాత రుద్రవరం మండలంలోని అలుమూరు గ్రామంలో రైతుల నుంచి పొలం కౌలుకు తీసుకుని పసుపు, వేరుశనగ, మిర్చి తదితర పంటలను సాగు చేశారు. ఆ తర్వాత క్రిష్ణగిరి మండలంలోని కోయిలకొండలో అల్లం, కందితో పాటు అరటి, బొప్పాయి, కలింగడ పండ్ల తోటలను సాగు చేశారు. సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించారు. ఆ తర్వాత డోన్ ప్రాంతంలోని కొచ్చెర్వు, మెట్టుపల్లి, జలదుర్గం గ్రామాల్లో రైతుల భాగస్వామ్యంతో అరటి, బొప్పాయి పండ్ల తోటలను సాగు చేశారు. వెల్దుర్తి మండలంలోని బోయినపల్లెలో ఎనిమిది ఎకరాల్లో అరటి తోటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సెమీ ఆర్గానిక్ విధానంలో పంటలను సాగు చేస్తున్నారు.





- కొట్టేసిన మొద్దులతో నారా, జ్యూస్ తయారీ
- కాయలతో పొడి ఉప ఉత్పత్తులు
- తోటల సాగులో స్ఫూర్తిగా సివిల్ ఇంజనీర్
- జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు
- రైతు శ్రేయోభిలాషిగా పరదేశీ మహేష్

● అరటి మొద్దులతో ఉప ఉత్పత్తులు

ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలతో పరదేశీ మహేష్ అరటి తోటలపై పరిశోధన చేస్తున్నారు. అరటి తోటల్లో చెట్లను కొట్టేసి, మిగిలిన అరటి మొద్దులతో ఉప ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసి తీసుకున్న అరటి మొద్దుల ద్వారా అరటి నారాను బయటకు తీస్తున్నారు. ఈ నార ఉత్పత్తులను బట్టల తయారీ కంపెనీలకు మార్కెటింగ్ చేస్తున్నారు. అరటి మొద్దుల మధ్యలో ఉండే సెంటర్ పోర్ స్టెమ్ నుంచి జ్యూస్‌ను బయటకు తీస్తున్నారు. ఈ జ్యూస్‌ను కిడ్నీలో రాళ్లను కరిగించే మెడిసిన్స్‌కు వినియోగిస్తున్నట్లు పరిశోధనలో తేలింది. అంతేగాక అరటి మొద్దుల వేస్టేజీని కంపోస్టుగా మార్చి సేంద్రియ ఎరువుగా వినియోగిస్తున్నారు. అదేవిధంగా అరటి కాయలతో పొడి చేసి వాటి ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నారు. పిల్లలకు తినిపించే సెరిలాక్ పౌష్టికాహారంలో ఈ పొడిన వినియోగిస్తున్నారు. ఇలా అరటి మొద్దులు, కాయల నుంచి ఉప ఉత్పత్తులు సాధిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సహకారంతో అరటి తోటల నుంచి సాధిస్తున్న ఉప ఉత్పత్తులతో మరిన్ని అరటి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పరదేశి మహేష్ ప్రణాళికలు రూపొందించుకున్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి అరటి ఉప ఉత్పత్తుల పరిశ్రమల గురించి వివరించనున్నట్లు పరదేశీ మహేష్ తెలిపారు.


అరటి మొద్దుల నుంచి తీసిన నార

● రైతు శ్రేయోభిలాషిగా:

డోన్ నియోజకవర్గ ప్రాంతంలో పరదేశి మహేష్ రైతు శ్రేయోభిలాషిగా గుర్తింపు పొందారు. పొలాల దగ్గరకు నేరుగా వెళ్లి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు ఎలా సాధించాలన్న దానిపై రైతులకు వివరిస్తున్నారు. డోన్ నియోజకవర్గ ప్రాంతంలో ఉద్యాన పంటలను ఎక్కువగా సాగు చేసేందుకు కృషి చేస్తున్నారు. కరోనా సమయంలోనూ రైతుల నుంచి పండ్లు, కూరగాయలను కొనుగోలు చేసి రూ.100కే ఐదు రకాల పండ్లను, కూరగా యలు పంపిణీ చేశారు. పోలీసు, పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు ఉచితంగా పండ్లు, కూరగాయల కిట్లను అందజేశారు. గత పాతికేళ్లుగా పరదేశి మహేష్ రైతులకు తన వంతు సేవలు అందిస్తూ రైతు బిడ్డగా పేరు సంపాదించుకున్నారు.

● జాతీయ స్థాయిలో ఉత్తమ అరటి రైతు అవార్డు

డోన్ ప్రాంతంలో అరటి తోటల సాగులో ప్రత్యేక గుర్తింపు పొందిన పరదేశి మహేష్ జాతీయ స్థాయిలో ఉత్తమ అరటి రైతు అవార్డు పొందారు. వివిధ ప్రాంతాలకు వెళ్లి అరటిపై పరదేశి మహేష్ పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో నేషనల్ రీసెర్చ్ పార్క్ బనానా సంస్థ ఏడు రాష్ట్రాల నుంచి 20 మందిని ఎంపిక చేసింది. అందులో మహేష్ జాతీయ స్థాయిలో ఉత్తమ అరటి రైతుతో పాటు ఎంటర్‌ట్రైనర్ అవార్డుకు ఎంపికయ్యారు. మూడు నెలల క్రితం తమిళనాడులోని తిరుచురాపల్లిలో జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో అరటి ఉత్తమ రైతు అవార్డును మహేష్ అందుకున్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అరటి జాతీయ పరిశోధన సంస్థ నుంచి ఇచ్చే రూ.5 లక్షల ప్రోత్సాహక రివార్డుకు మహేష్ ఎంపికయ్యారు. ఇలా అరటి తోటల సాగులో పరదేశీ మహేష్ మంచి ఫలితాలు సాధిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



జాతీయ స్థాయి ఉత్తమ అరటి రైతు అవార్డు అందుకుంటున్న పరదేశీ మహేష్

● అరటి పరిశ్రమలు తీసుకు రావాలన్నదే లక్ష్యం

డోన్ ప్రాంతంలో అరటి పరిశ్రమలు తీసుకు రావాలన్నదే తన లక్ష్యం. ఎన్నికల ప్రచార సమయంలో డోన్‌కు చంద్రబాబు నాయుడు వచ్చిన సమయంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ద్వారా అరటి తోటల పరిశోధన గురించి వివరించాను. అరటి ద్వారా ఉప ఉత్పత్తులు సాధిస్తున్న అంశాలపై తెలియజేశాను. ఈ ప్రాంత రైతులకు అరటి పరిశ్రమలు తీసుకురావాలన్నదే నా లక్ష్యం. అరటి ఉప ఉత్పత్తులతో వందల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుంది.

- పరదేశి మహేష్

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

● ఆర్‌యూ ఇన్‌చార్జి వీసీ

కర్నూలు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్ లాంటి అనవసర విషయాల్లో తలదూర్చి జీవితాలను పాడుచేసుకోవద్దని ఇన్‌చార్జి ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలోని సెనేట్ హాలులో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్‌లో సీనియర్లు జూనియర్ విద్యార్థులతో స్నేహ భావంతో మెలగాలని సూచించారు. జూనియర్ విద్యార్థులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు. డీఎస్పీ బాబు ప్రసాద్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ర్యాగింగ్ ఉండకూడదని ఎస్పీ బిందు మాధవ్ ఆదేశించారని అన్నారు. ర్యాగింగ్ నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు మాట్లాడుతూ ర్యాగింగ్ నివారణకు వర్సిటీలో చేపడుతున్న చర్యలను తెలిపారు. ఈ సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పి. నాగరాజు, ప్రొఫెసర్ భరత్, వెంకటరత్నం, విజయుడు, నాగచంద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

ఉత్తమ అధ్యాపకురాలిగా సౌజన్య

సీఎం చేతుల మీదుగా అవార్డు

డోన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సౌజన్య ఉత్తమ జూనియర్ లెక్చరర్ అవార్డును అందుకున్నారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సతీమణి సౌజన్య కర్నూలు నగరంలోని బీ.క్యాంపు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ టీచర్స్ అవార్డుల్లో ఇంటర్మీడియట్ విభాగం కింద సౌజన్య రాష్ట్ర స్థాయిలో ఉత్తమ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా సౌజన్య ఉత్తమ లెక్చరర్ పురస్కారాన్ని అందుకున్నారు.



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉత్తమ లెక్చరర్ అవార్డు అందుకుంటున్న సౌజన్య

కష్టాల క్లస్టర్

(5వ పేజీ తరువాయి)

దేశంలో వివిధ విశ్వవిద్యాలయాల్లో రద్దీని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం 'క్లస్టర్ యూనివర్సిటీ'లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) పథకం కింద కర్నూలుకు క్లస్టర్ యూనివర్సిటీని మంజూరు చేసింది. 2015 డిసెంబరు 1న న్యూఢిల్లీలో జరిగిన 'ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు' సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దక్షిణ భారతదేశంలోనే తొలి క్లస్టర్ విశ్వవిద్యాలయం ఇది. కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేవీఆర్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మెన్స్ డిగ్రీ కళాశాలను ఈ క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలోకి తీసుకొచ్చారు. 2016-17లో అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. డిగ్రీ కళాశాలలు నిర్మాణం కోసం రూసా కింద రూ.55 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపారు. 2019లో నిధులు మంజూరయ్యాయి. అయితే ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఓడిపోవడం.. వైసీపీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 'ఏపీ క్లస్టర్ యూనివర్సిటీ యాక్ట్-2020'ను తీసుకొచ్చారు. వర్సిటీ ఏర్పడినా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల సహకారం లేకపోవడం, వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు వారికే వత్తాసు పలకడంతో రెండేళ్లు అలంకార ప్రాయంగా మిగిలింది. డిగ్రీ కళాశాలలు చేపట్టిన అడ్మిషన్లలో అవకతవకలు జరగడంతో ఎట్టకేలకు మూడేళ్ల తరువాత 2023-24 విద్యా సంవత్సరం నుంచి క్లస్టర్ వర్సిటీ పర్యవేక్షణలో యూజీ, పీజీ అడ్మిషన్లు చేస్తున్నారు. ప్రస్తుతం మూడు డిగ్రీ కళాశాల పరిధిలో మూడేళ్ల యూజీ (డిగ్రీ)లో వివిధ కోర్సుల్లో 2,796 మంది, రెండేళ్ల పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ)లో 93 మంది విద్యార్థులు చదువుతున్నారు. బోధన, బోధనేతర సిబ్బంది 238 మంది పని చేస్తున్నారు.

● అసంపూర్తిగా భవన నిర్మాణాలు

కర్నూలు నగర శివారులో జగన్నాథగట్టుపై క్లస్టర్ యూనివర్సిటీ కోసం 50.5 ఎకరాలు కేటాయించారు. అకడమిక్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, బాలుర, బాలికల వసతి గృహాలు (హాస్టల్), జనరల్ ఫెసిలిటీస్ భవనం (లైబ్రరీ, ల్యాబ్, రీసెర్చ్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇంక్యూబేషన్ సెంటర్) నిర్మాణాల కోసం రూ.80 కోట్లు మంజూరు చేశారు. అయితే పనులు జాప్యం కావడంతో నిర్మాణ అంచనా వ్యయం రూ.139 కోట్లకు చేరింది. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు చేపట్టారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న సింగపూర్ సంస్థ ఆకార్ ప్లానర్ సంస్థ భవన నిర్మాణాల కోసం ప్లానింగ్ డిజైన్ (ఆర్కిటెక్చర్) ఇచ్చారు. డిజైన్ కోసమే రూ.65 లక్షలు ఖర్చు చేశారు. హైదరాబాద్‌కు చెందిన దక్కన్ కన్‌స్ట్రక్షన్ నిర్మాణ సంస్థ వర్సిటీ భవన నిర్మాణాలకు సంబంధించి కాంట్రాక్ట్ దక్కించుకొని పనులు మొదలు పెట్టింది. స్కిల్ డెవలప్‌మెంట్ ఫండ్ దాదాపు రూ.46 కోట్లు ఖర్చు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నిధులు కేటాయించినా పనులు మాత్రం మొదలు పెట్టలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో వెలుగు చూసిన అక్రమాలే ఇందుకు కారణమని తెలుస్తోంది.

● బిల్లుల చెల్లింపులో నిబంధనలకు తూట్లు

క్లస్టర్ వర్సిటీ నిర్మాణం కోసం మంజూరు చేసిన నిధులు వర్సిటీ రిజిస్ట్రార్ ఖాతా (అకౌంట్)లో ప్రభుత్వం జమ చేస్తుంది. కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం ఏ మేరకు పనులు చేశారు..? చేసిన పనులు కొలతలు.. చేసిన ఖర్చుల వివరాలతో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్లు నిబంధనల ప్రకారం ఎం-బుక్ రికార్డు చేయాలి. వర్సిటీ రిజిస్ట్రార్ పరిశీలించి అప్రూవల్ ఇవ్వడమే కాకుండా సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో మ్యాపింగ్ చేసి అప్‌లోడ్ చేయాలి. ఆ తరువాతే కాంట్రాక్టర్ ఖాతాలకు బిల్లులు జమ అవుతాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో నంబరు-2గా చెప్పుకున్న ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రి అండతో ఇష్టారాజ్యంగా బిల్లులు చెల్లింపులు చేసినట్లు సమాచారం. రిజిస్ట్రార్‌కు ఏ మాత్రం సంబంధం లేకుండా ఉన్నత విద్యా శాఖ కీలక అధికారుల సలహాతో ఆర్థిక శాఖ కార్యాలయంలోనే మ్యాపింగ్ చేసి ఏపీఈడబ్ల్యూఐడీసీ ఖాతాకు నిధులు జమ చేశారు. అక్కడి నుంచి దాదాపు రూ.36 కోట్లు కాంట్రాక్టర్ ఖాతాకు జమ చేసినట్లు సమాచారం. కీలకమైన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఖాతాలో ఉన్న డబ్బును ఆయనకు తెలియకుండా ఆర్థిక శాఖ అధికారులు మరో ఖాతాకు మళ్లించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీని వెనుక ఆనాటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా నిధులు మళ్లింపుపై యూనివర్సిటీ అధికారులు ఆనాడే రాష్ట్ర గవర్నర్‌తో పాటు విద్యా శాఖ, ఆర్థిక శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలు, సీఎంఓ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆనాడే పనులు ఆపేశారు. గత వైసీపీ పాలకులు చేసిన పాపాలు.. విద్యార్థులను శాపాలై వెంటాడుతున్నాయి. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ జోక్యం చేసుకొని వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖాతాలు మళ్లించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అసంపూర్తిగా ఆగిపోయిన పనులకు మోక్షం కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.


జగన్నాథగట్టుపై అసంపూర్తిగా క్లస్టర్ యూనివర్సిటీ భవనాలు

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించే గడువు తేదీ పొడిగించినట్లు ఆర్ఐఓ గురువయ్య శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు నవంబరు 21వ తేది వరకు ఆలస్యం రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చునన్నారు. రూ. 1000 అపరాధ రుసుముతో డిసెంబరు 5వ తేది వరకు చెల్లించవచ్చునని ఆయన పేర్కొన్నారు. మరోసారి గడువు పెంచే ఆస్కారం లేదని ఆయన విజ్ఞప్తి చేశారు.

సిరులు కురిపిస్తున్న పొగాకు

- ఓర్వకల్లులో పెరిగిన సాగు విస్తీర్ణం
- గిట్టుబాటు ధరే కారణం

ఓర్వకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పొగాకు పంట సిరులు కురిపిస్తుంది. గత ఏడాది కంటే ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పంట సాగు చేశారు. దిగుబడి కూడా ఆశాజనకంగా వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది పొగాకు పంటకు గిట్టు బాటు ఉండటంతో రైతులు ఈ ఏడాది పొగాకు పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. గత మూడే ళ్లుగా మండలంలో పత్తి పంట విస్తీర్ణం రైతులు అధికం గా సాగు చేసేవారు. అయితే.. ఈ ఏడాది పత్తి పంట విస్తీర్ణం తగ్గగా.. పొగాకు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అయితే గత పదేళ్ల క్రితం మండలంలో పొద్దు తిరుగుడు పంట భారీ విస్తీర్ణంలో సాగు చేసేవారు. అయితే.. ఆ పంట కనుమరుగైంది. పొగాకు పంట మండలంలోని హుశేనాపురం, గుట్ట పాడు, ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, శకునాల, తిప్పా యపల్లె తదితర గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 10,350 ఎకరాల్లో పొగాకు కేఎఫ్‌సీ రకం పంటను సాగు చేశారు. అయితే గత ఏడాది ఎకరాకు 8 నుంచి 9 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. క్వింటం ధర రూ.14 వేల నుంచి రూ.15వేలు ధర విక్రయించారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో ఎకరాకు 9 నుంచి 10 క్విం టాళ్ల దిగుబడి వస్తుందని.. అయితే క్వింటం ధర రూ.12వేల నుంచి రూ.17వేల వరకు వస్తే బాగుంటుం దని రైతులు అంటున్నారు.

20 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశా



ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో 20 ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశా. 20 ఎకరాలు గుత్తగా రూ.4 లక్షలు చెల్లించాం. పంటపై పెట్టుబడి రూ.8 లక్షలు పెట్టాను. దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది. ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి పెట్టాను. క్వింటం ధర రూ.17వేలు నిర్ణయిస్తే బాగుంటుంది

- మధుసూదన్, రైతు, హుశేనాపురం



ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు మెగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో టీటీసీ, బీఈడీ, ఏపీటెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్/ ఈబీసీ అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. ఈ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఏపీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో స్వయంగా వచ్చి తమ బయోడేటాతో పాటు రెండు ఫొటోలు, స్టడీ, టెట్, కుల, ఆదాయం ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్ కార్డు పాన్‌కార్డు జిరాక్స్ ప్రతులను దరఖాస్తుకు జతపరిచి 15వ తేదీ లోపు సమర్పించాలన్నారు. అభ్యర్థుల ఎంపిక టెట్ మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందన్నారు. వివరాలకు కర్నూలు అబ్బాస్ నగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో కార్యాలయంలో గాని, 08518-236076 నెంబరులోగాని సంప్రదించాలన్నారు.

ఇసుక రీచ్ కోసం పరిశీలన

హొళగుంద, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హొళగుంద మండలంలోని ముద్దటమాగి, మార్లమాడికి గ్రామం వద్ద ప్రవహిస్తున్న వేదవతి నదిలో ఇసుక రీచ్ కోసం రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూస్ అధికారులు మంగళవారం నదిని పరిశీలించారు. ఇసుక రీచ్‌లు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై వివరాలను సేకరించారు. మార్లమాడికి వద్ద రీచ్ ఏర్పాటు చేయడానికి అనువుగా లేదని గుర్తించినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో మైన్స్ ఏడీ రవిచంద్రన్, తహసీల్దార్ సతీష్, డిప్యూటీ తహసీల్దార్ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

కష్టపడిన వారికి న్యాయం జరుగుతుంది

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సోమిశెట్టిని సన్మానిస్తున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కష్టపడిన వారందరికీ న్యాయం జరుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో కుడా చైర్మన్‌గా ఎంపికైన సోమిశెట్టి వెంకటేశ్వర్లును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల రాక్షస క్రీడలో భయపడకుండా పార్టీ కోసం సేవలందించిన సోమిశెట్టి పని తీరుకు న్యాయం జరిగిందన్నారు. అలాగే కురుబ సామాజిక వర్గానికి చెందిన ఎం.దేవేంద్రప్ప, కపట్రాళ్ల బొజ్జమ్మకు పదవులు ఇచ్చి బీసీలకు ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే మంత్రి టీజీ భరత్‌పై వైసీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. సోమిశెట్టి మాట్లాడుతూ కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలని కోరుకుంటున్నానని అన్నారు. ఆర్యవైశ్య సామాజిక వర్గం చేసిన సేవలను చంద్రబాబు గుర్తించి తనకు రెండోసారి కుడా చైర్మన్ బాధ్యతలు ఇచ్చారని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, ఆకెపోగు ప్రభాకర్, పి.రాజు, షేక్షావలి, డి జేమ్స్, మల్లెల పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పథకాన్ని ఉపయోగించుకోవాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి



ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ ఎం.ఉమాపతి

కల్లూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు ఊర్జావీర్ ఎఫీషియన్సీ వారియర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని విద్యుత్ భవన్‌లో ఎస్ఈ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్లకు శిక్షణ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని 1.2 లక్షల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు శుభవార్త చెప్పిందని, అర్హులందరూ ఉపయోగించుకోవాలన్నారు. కేంద్రంతో కలిసి ఏపీ ఈ పథకాన్ని ముందుకు తీసుకెళుతుందని, వారికి అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ తనిఖీ అధికారి అజయ బాబు, నోడల్ అధికారి యామిని, ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీస్ లిమిటెడ్ జిల్లా కోఆర్డినేటర్ జగదీష్‌కుమార్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ సర్టిఫికెట్ల బోర్డు మార్పు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మెడికల్ సర్టిఫికెట్ల బోర్డును ధన్వంతరీ హాలులో కాకుండా సదరం (మార్చురీ దగ్గర) ఓపీ నెంబర్ 41లో నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే వెంకటేశ్వర్లు వెల్లడించారు. లిఫ్ట్ పని చేయక పోవడంతో అక్కడికి మార్చినట్టు తెలియజేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సర్టిఫికెట్లు అర్హులకు ఇస్తామన్నారు. ప్రభుత్వం రోగులకు పెన్షన్ పెంచడానికి అనుమతులు జారీ చేసిందని తెలిపారు.

చందన బ్రదర్స్‌లో చోరీ

కర్నూలు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోని చందన బ్రదర్స్ దుస్తుల షోరూంలో చోరీ జరగింది. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.2.30 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత షోరూం నిర్వాహకులు తాళాలు వేసి వెళ్లిపోయారు. మంగళవారం వచ్చి చూస్తే క్యాష్ కౌంటర్లు తెరిచి ఉన్నట్లు మేనేజర్ మునీశ్వర్ రావు గుర్తించారు. అందులో ఉన్న నగదు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నాగరాజరావు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులకు కొన్ని వివరాలు లభించాయి. షోరూం పై భాగం నుంచి దొంగలు కిందకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంబై పోలీసులమని సైబర్ నేరస్థుల వల

● రూ.3.60 లక్షలు మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

డోన్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ నేరస్థుల వలలో చిక్కుకుని మోసపోయారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన భార్యాభర్తలు కృష్ణ, శిరీషలకు ముంబై నుంచి ఫోన్ వచ్చింది. ఇంగ్లీషులో మాట్లాడుతూ తాము ముంబై పోలీసులమని చెప్పారు. ఇల్లీగల్ యాక్టివిటీస్‌లో మీ పేర్లు చూపిస్తున్నాయని, త్వరితగతిన ముంబైకి రావాలని ఫోన్‌లో ఒత్తిడి చేయడంతో వారు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఆ సమయంలో వివరాలు తెలియపరచాలని సైబర్ నేరస్థులు ఫోన్‌లో అడుగగా తన భార్య పేరు మీద ఉన్న అకౌంటు వివరాలు కృష్ణ తెలియజేశాడు. ఆ తర్వాత తన భార్య అకౌంటు నుంచి రూ.3.60 లక్షల దాకా ట్రాన్స్‌ఫర్ అయింది. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మంత్రి టీజీని అభినందించిన చంద్రబాబు



సీఎం చంద్రబాబుతో రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ తదితరులు

కర్నూలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు తీసుకురావడంలో మంత్రి టీజీ భరత్ కృషి అభినందనీయమని సీఎం చంద్రబాబు కొనియాడారు. మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. రాష్ట్రంలో 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా రాష్ట్రానికి రూ.57,650 కోట్ల ఆదాయంతోపాటు 2.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమలను తీసుకు రావడంలో మంత్రులు టీజీ భరత్, గట్టిపాటి రవికుమార్‌లు కృషి చేశారని చంద్రబాబు అభినందించారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని మంగళవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.ఇస్మాయిల్, మరియానందంలు డీఈవో శ్యామూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాలలో నాలుగు పీడీ పోస్టులు ఉన్నప్పటికీ అన్నీ కూడా డైరెక్టు రిక్రూట్‌మెంట్‌కు చూపుతున్నట్లు తెలిపారు. ఆదోని మున్సి పాలిటీలో కూడా 3 పోస్టులు స్కూల్ అసిస్టెంట్లు ఖాళీగా ఉన్నప్పటికీ ఒక్కటి కూడా పదోన్నతికి ఖాళీ చూపలేదని తెలిపారు. పదోన్నతులు రిక్రూట్‌మెంట్ 70:30 శాతం నిష్పత్తిని కోరుతూ పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కే.తిమ్మప్ప, సాంబశివుడు, పెద్దస్వామి, జి.శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, రామకృష్ణ, రాంప్రసాద్ పాల్గొన్నారు.

తుంగభద్రకు 192 టీఎంసీలు

(5వ పేజీ తరువాయి)



ఎల్లెల్సీ

నీటి సంవత్సరం జూన్ 1 నుంచి మే 31 వరకు 212 టీఎంసీలు వరద వినియోగించుకునేలా రిజర్వాయర్ డిజైన్ చేశారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్-1 (కేడబ్ల్యుడీటీ) అవార్డు ప్రకారం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కాలువలకు నికర జలాల కేటాయింపులు చేశారు. ప్రతి ఏటా నీటి సంవత్సరం ప్రారంభంలో టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశమై గడిచిన పదేళ్లుగా జలాశయంలో చేరిన వరద లెక్కలు ఆధారంగా నీటి చేరికపై అంచనా వేస్తారు. నవంబరు లేదా డిసెంబరులో తుది అంచనాలు వేస్తారు. ఈ నీటి సంవత్సరంలో జూన్ నెలలో జరిగిన సమావేశంలో 172 టీఎంసీలు చేరవచ్చని అంచనా వేశారు. అందుకు ఎక్కుగా వరద వచ్చింది. దీంతో 192 టీఎంసీలకు తుది అంచనా వేశారు. ఈ మేరకు కేడబ్ల్యూడీటీ అవార్డు దామాషా ప్రకారం పంపిణీ చేశారు.

● ఆంధ్ర వాటాగా 60.227 టీఎంసీలు

తుంగభద్ర జలాశయం నుంచి ఈ ఏడాది 192 టీఎంసీల వినియోగంపై అంచనా వేసి పంపకాలు చేశారు. బచావత్ అవార్డు ప్రకారం కర్ణాటక 138.990 టీఎంసీలు (65.56 శాతం)కు గానూ 125.878 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ వాటా 66.50 టీఎంసీలు (31.37 శాతం)కు గానూ 60.227 టీఎంసీలు, తెలంగాణ 6.51 టీఎంసీలు (3.07 శాతం)కు గాను 5.896 టీఎంసీలు కేటాయించారు. కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీ నీటి వాటా 24 టీఎంసీలకు గానూ 21.736 టీఎంసీలు, కేసీ కాలువ వాటా 10 టీఎంసీలకు గానూ 9.057 టీఎంసీలు, అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ వాటా 32.50 టీఎంసీలకు గానూ 29.434 టీఎంసీలు కేటాయింపులు చేశారు.

● 33.071 టీఎంసీలు మిగులు:

తుంగభద్ర నీటి కేటాయింపులు పరిశీలిస్తే.. ఎల్లెల్సీ వాటా 21.736 టీఎంసీలకు గానూ 8.526 టీఎంసీలు వాడుకోగా 13.21 టీఎంసీలు మిగులుగా ఉన్నాయి. కేసీ కెనాల్ వాటా 9.057 టీఎంసీల్లో ఏమాత్రం వాడుకోలేదు. అనంతపురం జిల్లాకు హెచ్చెల్సీ వాటా 29.434 టీఎంసీలు కేటాయిస్తే 18.629 టీఎంసీలు వాడుకోగా 10.805 టీఎంసీలు మిగులుగా ఉన్నాయి. ఈ లెక్కన రాష్ట్ర వాటాలో 60.227 టీఎంసీలకుగాను 27.155 టీఎంసీలు ఇప్పటికే వినియోగించుకోగా.. డ్యాంలో 33.071 టీఎంసీలు మిగులు జలాలుగా ఉన్నాయి. ఎల్లెల్సీ కింద ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు, 195 గ్రామాలకు తాగునీరు అందుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ ఆఖరు వరకు సాగునీరు ఇవ్వవచ్చని అంచనా వేస్తున్నారు.

● ఏపీ వాటాలో వివిధ కాలువకు కేటాయింపులు (టీఎంసీల్లో)..

కాలువ	వాటా	కేటాయింపు	వాడుకున్నది	మిగులు
ఎల్లెల్సీ	24.00	20.736	8.526	13.21
కేసీ కెనాల్	10.00	9.057	--	9.057
హెచ్చెల్సీ	32.50	29.434	18.629	10.805
మొత్తం	66.50	60.227	27.155	33.071

● నీటి కేటాయింపులు (టీఎంసీల్లో):

రాష్ట్రం	వాటా	కేటాయింపు
కర్ణాటక	138.990	125.878
ఆంధ్రప్రదేశ్	66.500	60.226
తెలంగాణ	6.510	5.896
మొత్తం	212	192

హైవే టెర్రర్

● తరచూ రోడ్డు ప్రమాదాలు ● పది రోజుల్లోనే ఆరుగురి మృతి



ప్రమాదాలకు నిలయంగా మారిన ఆదోని- మంత్రాలయం జాతీయ రహదారి



ప్రమాదానికి గురైన కారు

ఎమ్మిగనూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదోని-మంత్రాలయం జాతీయ రహదారి(167) ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆ హైవేపై ప్రయాణించాలంటే టెర్రర్‌గా మారింది. కేవలం పది రోజుల వ్యవధిలోనే ఈ హైవేపై రెండు భారీ ప్రమాదాలు చోటు చేసుకొని ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. అంతేగాక గతంలో సైతం ఇదే హైవేపై హాలహర్వి గ్రామ సమీపంలోను, ఎమ్మిగనూరు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర రెండు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదాల్లో ప్రధానంగా యువకులు ఎక్కువశాతం మృతి చెందారు. హైవేపై ప్రయాణించాలంటేనే ప్రయాణికులు, వాహనదారులు బీతిల్లుతున్నారు. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడంలేదు. ప్రధానంగా అతివేగం వల్లే ఈ ప్రమాదాలు చోటు చేసుకొని ప్రాణాలు గాల్లోకలుస్తున్నాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు కొద్దిపాటి ఆనందం కోసం అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు తీవ్రమనోవేదనను మిగులుస్తున్నారు.

పది రోజుల్లోనే ఆరుగురి మృతి

ఆదోని-మంత్రా లయం హైవేపై ముగతి, ధర్మాపురం గ్రామాల మధ్యలో పది రోజుల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 10 రోజుల క్రితం ఓ ఆటోను వెనుక నుంచి వేగంగా వస్తున్న కర్ణాటకకు చెందిన కారు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడి మృతిచెందారు. అలాగే రెండు రోజుల క్రితం హైవేపై ముగతి మోడల్‌స్కూల్ సమీపంలో రెండు బైకులు ఢీకొని ముగ్గురు యువకులు మృతి చెందారు. అలాగే హాలహర్వి, ఎమ్మిగనూరు పట్టణంలోని కమిటీ సర్కిల్, విద్యుత్ సబ్‌స్టేషన్, ఎంజీ సర్కిల్, అన్నమయ్య సర్కిల్, హనుమాపురం గ్రామ సమీపం, కోటేకల్ క్రాస్‌రోడ్డు, బోడబండ, బనవాసి, జవహర్ నవోదయ వరకు ఇలా నిత్యం హైవేపై ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతుండగా మరికొంతమంది అవయవాలు కోల్పోయి అవటివారిగా మారుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

యురేనియం తవ్వకాలు వైసీపీ అభూతకల్పన

● కప్పట్రాళ్లలో తవ్వకాలకు ఆస్కారమేలేదు ● అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే కేఈ



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ, నవంబరు 12: కప్పట్రాళ్లలో ప్రభుత్వం యురేనియం తవ్వకాలు వైసీపీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే విరుపాక్షి అభూత కల్పనే అని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం అమరావతిలోని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి టీజీ భరత్, జిల్లా ఎమ్మెల్యేలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. యురేనియం తవ్వకాలు జరిగితే చుట్టుపక్కల 150 కిలో మీటర్ల పరిధిలో రేడియేషన్‌తో ప్రజలు క్యాన్సర్ బారిన పడతారని, ఉళ్లకు ఊళ్లు ఖాళీ చేయాల్సి వస్తుందన్న ప్రచారాలతో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని తెలిపారు. దీంతో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగా యురేనియం తవ్వకాలు ఉండవని చెప్పారని తెలిపారు. ఈ విషయంపై కప్పట్రాళ్లకు వెళ్లి ప్రజలకు తెలపాలని, అలాగే మీడియా ద్వారా ప్రపంచానికి తెలియజేయమని ఆయన సూచించారని చెప్పారు. నిజానికి కప్పట్రాళ్ల వద్ద యురేనియం నిక్షేపాల గుర్తింపునకు బోరు తవ్వకాలకు అనుమతి ఇచ్చింది అప్పటి వైసీపీ ప్రభుత్వమేనని, అప్పుడు ప్రభుత్వంతోపాటు వత్తాసుపలికిన ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఈరోజు ప్రజల వద్దకు వచ్చి యురేనియం తవ్వకాలతో అన్యాయం జరిగిపోతోందంటూ గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికి, ఎప్పటికి కప్పట్రాళ్లలో యురేనియం తవ్వకాలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మిగనూరు, కొడుమూరు, ఆదోని ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, పార్థసారథిలు ఉన్నారు.

శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్పించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ అన్నారు. బీఐఎస్ ఆధ్వర్యంలో లెర్నింగ్ సైన్స్ స్టాండర్స్-12 అను అంశంపై ఉమ్మడి జిల్లాలోని 52 మంది సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో శ్యామ్యూల్ పాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో సైంటిస్టు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ వివేకా వర్దన్ రెడ్డి, ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు, ఎంఈవో వినోద్ కుమార్, బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ కృష్ణవీర్‌వర్మ, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

గూడూరు నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో వివాహితపై గోపాల్ అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. మహిళ పొలం పనులకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఆ మహిళ తప్పించుకొని గూడూరు పోలీసులను ఆశ్రయించింది. మహిళ ఫిర్యాదు మేరకు గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

● **బేతంచెర్ల:** అభం శుభం తెలియని ఏడేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి అత్యాచారయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ ఏడేళ్ల బాలికకు వడ్డె చిన్న ఎల్లయ్య మాయమాలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడు. చిన్నారి గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడకు చేరుకునేలోపే వడ్డె చిన్న ఎల్లయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక ఓ ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. తల్లి కూలి పనికి వెళ్లగాఎల్లయ్య గమనించి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్ఎంలను యథాస్థానాలకు పంపాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న నాగరాజు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న ఏఎన్ఎంలను యథాస్థానాలకు పంపాలని ఏపీ తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. నాగరాజు డీఎంహెచ్‌వో డ్టార్ ఎల్.భాస్కర్‌ను కోరారు. మంగళవారం సంఘం నాయకులతో కలిసి ఆయన డీఎంహెచ్‌వోకు వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాలో ఏఎన్ఎంలు సుదూర ప్రాంతాలకు వెళ్లి కుటుంబానికి దూరంగా ఉన్నారని, కానీ వారి జీతం మాత్రం పాత స్థానమైన ఉప కేంద్రాల్లో తీసుకుంటున్నారని డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ం ఎ.మాధవరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇసుక డిపోల ఏర్పాటుకు దరఖాస్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆత్మకూరు, డోన్ ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఇసుక డిపోల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్లు గనులు, భూగర్భ శాఖ అధికారి ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వతేదీ సాయంత్రం 5గంటలలోపు సొంత భూమి, వాహనాల పత్రాలతో జిల్లా భూగర్భ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని కోరారు. వివరాలకు క్రాంతినగర్‌లో వున్న భూగర్భ శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అవినీతికి పాల్పడితే తొలగిస్తాం


మాట్లాడుతున్న డ్వామా పీడీ జనార్దన్‌రావు

మహానంది, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే విధుల నుంచి తొలగిస్తామని డ్వామా పీడీ, ప్రత్యేకాధికారి జనార్దన్‌రావు హెచ్చరించారు. మంగళవారం బుక్కాపురం పొదుపు భవనంలో 2023-2024 ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీడీవో మహ్మద్‌దౌలా అధ్యక్షతన నిర్వహించారు. 878 పనులకు రూ.6,17,90,411 ఖర్చు చేయగా, రూ. 29,121 అవినీతి జరిగినట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించారు. ఉపాధిహామీ కింద పొలాలకు మట్టి రోడ్లను నిర్మించాలని టీడీపీ కన్వీనర్ ఉల్లిమధు, యూనిట్ ఇన్‌చార్జి కాకర్ల శివ వినతిపత్రం అందచేశారు. జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నంద్యాల, ఆత్మకూరు ఏపీడీ బాలాజి నాయక్, అన్వర్‌బేగం, జిల్లా విజిలెన్స్ అధికారి షీబా, సామాజిక తనిఖీ బృందం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కాంతయ్య, ఏపీవో మనోహర్, ఏవో శ్రీనివాసరెడ్డి, ఈసీ రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ కస్టమర్స్ వర్క్‌షాపు

నంద్యాల కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిడాట్ ఎక్స్ఛేంజ్‌లో ఈనెల 14 వతేదీ గురువారం ఉదయం 11గంటలకు కన్స్యూమర్స్ ఎడ్యుకేషన్ వర్కుషాప్ నిర్వహిస్తున్నట్లు డీఈ యల్లా రమేష్ తెలిపారు. వినియోగదారులు పాల్గొనాలని ఆయన కోరారు.

మరబోటు నిర్వాహకుల ఇష్టారాజ్యం

- 4 కిలోమీటర్లకు రూ.300
- బెంబేలెత్తుతున్న భక్తులు


బోటులో పరిమితికి మించి ఎక్కుతున్న భక్తులు

కొత్తపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బోటు నిర్వాహకులు కృష్ణానదిలో కేవలం 4 కి.మీలకు ఒక్కొక్కరి నుంచి రూ.300 వసూలు చేస్తున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. కార్తీక మాసం కావడంతో భక్తులు తెలంగాణ సోమశిల నుంచి సంగమేశ్వరం వరకు.. సంగమేశ్వరం నుంచి ఆవలి ప్రాంతంలో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. సంగమేశ్వరం నుంచి కృష్ణానదిలో సోమశిల వరకు, సోమశిల నుంచి సంగమేశ్వరం వరకు మరబోటులో ప్రయాణం చేయాలంటే భక్తులు బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 నుంచి 12 మంది వరకే ఎక్కించుకోవాల్సి ఉంది. అయితే బోటు నిర్వాహకులు 30 నుంచి 40 వరకు భక్తులను ఎక్కిస్తున్నారు. అలాగే లైఫ్ జాకెట్లు కూడా ఇవ్వకుండా, భక్తుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అనుమతి లేకుండానే మరబోట్లు నడుపుతున్నట్లు సమాచారం. ఇదంతా అధికారులకు తెలిసినా నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, మరబోట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకుని భక్తులు కోరుతున్నారు.

రీ సర్వే భూ సమస్యల పరిష్కారం : తహసీల్దార్


తమ్మరాజుపల్లెలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దారు

పాణ్యం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో చోటుచేసుకున్న భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం తమ్మరాజుపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. జాయింట్ ఎల్‌పిఎంల సమస్యలను రెండు రోజుల నుంచి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇనాం జాయింట్ ఎన్‌పిఎం సమస్య నుంచి రైతులు విముక్తి పొందుతున్నారని అన్నారు. రైతులు దరఖాస్తు చేసుకోవాలని, రెండు రోజుల్లో పది సమస్యలు పరిష్కరించామన్నారు. కాగా ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 1433 దరఖాస్తులు రాగా, జాయింట్ ఎన్‌పిఎంలు 396, విస్తీర్ణం సమస్యలపై 401, మ్యూటేషన్‌కు 235, క్లాసిఫికేషన్ సమస్యలపై 377, పేర్ల మార్పుకు 3 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఆర్‌ఐ రాము, సర్వేయరు నాగరాజు, సర్పంచ్ విజయగౌరి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, టీడీపీనాయకులు దుబయ్ శీను, మధు, సురేష్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీఎల్వోలు బాధ్యతగా పని చేయాలి

నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలని ఈఆర్‌వో కొండయ్య ఆదేశించారు. మంగళవారం గోస్పాడు తహసీల్దార్ షేక్‌మహబూబ్, నంద్యాల రూరల్ డిటి రామచంద్రరావు, ఎన్నికల డీటి విజయశేఖర్ ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను పరిశీలించాలన్నారు.

15న కార్తీక దీపోత్సవం

నంద్యాల కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వతేదీన రెడ్డి సంఘం అధ్యక్షుడు ఆర్‌వి సుబ్బారెడ్డి అధ్వర్యంలో నంద్యాల మూలమఠంలో దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 24వ తేదీ ఆదివారం కార్తీక వనభోజనాలు వుంటాయన్నారు. నన్నల సాయిరాంరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి

ఆత్మకూరురూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి పంటలను రైతులు పంటల బీమా ప్రీమియంను చెల్లించాలని ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. బీమా పరిహారం పొందాలంటే బీమా ప్రీమియం చెల్లించాలని అన్నారు. డిసెంబరు 15వ తేదీలోగా మినుము, వరి, శనగ, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలకు ప్రీమియం చెల్లించాలని సూచించారు. 33 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తున్న మినుము విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలలో పొందాలని సూచించారు. పట్టుపరిశ్రమ అధికారి అరుణ, ఏఈవో రాజశేఖర్, ఉద్యావన శ అధికారులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రియల్టర్లు నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలు పాటించాలని కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. మంగళవారం రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. నిబంధనల ప్రకారం రహదారులు, 10శాతం భూమిని మున్సిపాలిటీకి అప్పగించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వెంచర్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్, టీపీవో రామకృష్ణ తదితరులు ఉన్నారు.

భూములను పరిశీలించిన తహసీల్దార్

కొత్తపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్‌హెచ్-167కే కల్వకుర్తి-నంద్యాల రహదారి నిర్మాణంతో భూములు కోల్పోతున్న రైతుల పొలాలను తహసీల్దార్ ఉమారాణి మంగళవారం పరిశీలించారు. దుద్యాల శివారు పొలాలను వీఆర్వో లింగస్వామి, సర్వేయర్ సురేష్‌తో కలిసి మ్యాప్ ద్వారా వివరాలను తెలుసుకున్నారు. ఎన్‌హెచ్-167కే రహదారి నిర్మాణానికి కొత్తపల్లి మండలంలో మొత్తం 291.43 ఎకరాలను సేకరించినట్లు చెప్పారు. ఇందులో 235 ఎకరాలు ప్రైవేటు భూములు కాగా, 53.43 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నట్లు చెప్పారు. భూములను కోల్పోయే రైతుల వివరాలు జేసీ వద్ద ఉన్నాయని, వీరికి త్వరలో పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నేత్ర దానం

నంద్యాల కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పసుపుల సత్యనారాయణ మంగళవారం మృతిచెందాడు. దీంతో కుమారులు పసుపుల రవి, సుధాకర్ సత్యనారాయణ తమ తండ్రి నేత్రాలను రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా కోఆర్డినేటర్ కండే ఆనంద్‌గురూజీ ఆధ్వర్యంలో సేకరించిన నేత్రాలను హైదరాబాదు ఎల్వీ హాస్పటల్‌కు పంపారు. ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ పట్టణంలో రెడ్‌క్రాస్ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించాక 11మందితో నేత్రదానం చేపించామని, దీంతో 22 మందికి చూపు ఇచ్చినవారమవుతామన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల, మెంబర్ నాగేశ్వరరావు, రామక్రిష్ణ, మోహన్, రాము పాల్గొన్నారు.

కురువలకు ప్రాధాన్యమివ్వడంపై హర్షం

గడివేముల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కురువలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడంపై ఆ సంఘం కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కురువ చైర్మన్ పదవిని కర్నూలు జిల్లాకు చెందిన మాన్వి దేవేంద్రప్పకు ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలోని సబితమ్మకు మంత్రిపదవి, కర్నూలు ఎంపీ స్థానాన్ని కురువలకు కేటాయించారన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాములపాడు నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 57వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. 14వ తేదీ బాలల దినోత్సవం, నెహ్రూజయంతి, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ అయ్యంకి రమణయ్య, రంగనాథన్, గాడిచెర్ల హరి సర్వోత్తమరావును స్మరించుకొనుట, 17, 18 తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న దివంగత మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి, 20వ తేదీన ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

సంతృప్తికరమైన పరిష్కారం చూపాలి


మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా

- ప్రజా వేదిక సమస్యలను పరిష్కరించాలి
- డీపీవో జమీవుల్లా

నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పొన్నాపురం కాలనీలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీఎల్ పీవో, ఈవోఆర్‌డీ, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారిక వేదికకు వచ్చే దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలన్నారు.సమాచారాన్ని దరఖాస్తుదారులకు అందజేయాలని సూచించారు. ప్రజలలో ప్రభుత్వం మీద నమ్మకం కలిగేలా పరిష్కారం ఉండాలన్నారు. పాణ్యం, కొలిమిగుండ్ల, శిరివెళ్ల మండలాల నుంచి ఎక్కువగా భూ ఆక్రమణ ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. ఆక్రమణల సమస్యల పరిష్కారానికి తహ సీల్దార్ల సహకారం కావాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు.

బీమా చెల్లించాలి


పొలం పిలుస్తుందిలో పాల్గొన్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు డిసెంబరు 15వ తేదీలోగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ సంచాలకుడు ఆంజనేయ సూచించారు. మంగళవారం గుమ్మడాపురం, శివపురం గ్రామాల్లో ఏవో మహేష్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల్లో వీబీఎన్-8 మినుము విత్తనాలు 33శాతం సబ్సిడీతో ఉన్నాయని, రైతులు పొందాలన్నారు. సర్పంచులు, పశువైద్యాధికారి భువనేశ్వరి, సెరికల్చర్ ఏఎస్‌వో లింగమూర్తి, వ్యవసాయ సిబ్బంది నాగశ్రీ, రైతులు పాల్గొన్నారు.

కంది, మినుము సాగులో సస్యరక్షణ చర్యలు


పారుమంచాలలో కందిపంటను పరిశీలిస్తూ..

జూపాడుబంగ్లా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కంది, మినుము, మిరప పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రామకృష్ణారావు రైతులకు సూచించారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా మంగళవారం పారుమంచాల గ్రామంలో మినుము, మిరప పంటలను పరిశీలించారు. కాయతొలిచే పురుగు, మారుకామచ్చల పురుగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు వాటిని కాపాడుకోవాలన్నారు. పురుగుల నివారణకు వేపనూనె వాడాలని, మోనోక్రోటోపాస్ లేదా అసిఫెట్ మందులను పిచికారీ చేయాలని సూచించారు. పూత, పిందెదశలో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు దశలవారీగా పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చని అన్నారు. ఏవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై 'ప్రజా పోరు'


ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న నాయకులు

ఆత్మకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం చేపట్టిన ప్రజాపోరు యాత్ర మంగళవారం రెండో రోజు కొనసాగింది. పట్టణంలోని సంగమేశ్వరం సర్కిల్, వెంగళరెడ్డినగర్, అర్బన్‌కాలనీ, వీరభద్ర ప్రాంతంలో పార్టీ నాయకులు రణధీర్, రామ్ను నాయక్, ఇస్మాయిల్, సద్దాం హుసేన్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని అన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు ప్రజలపై మోపడం సరికాదన్నారు. నిత్యావసరాలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉచిత ఇసుక ఇస్తామని ప్రకటించినా, దొరకడం లేదన్నారు. కొత్త మద్యం పాలసీ పేరుతో ఊరురా బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి ప్రజలను మద్యానికి బానిసగా మారుస్తున్నారని ఆరోపించారు. నవంబరు 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ భాస్కరరెడ్డి

ఆత్మకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) ప్రోగ్రాంను విజయవంతం చేద్దామని నోడల్ ఆఫీసర్ భాస్కరరెడి పిలుపు నిచ్చారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో వలంటీర్లకు ఇచ్చారు. సమాజానికి జీవితకాలమంతా అభ్యసన, అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో 15 నుంచి 55ఏళ్ల వారికి అక్షరాస్యత కల్పించేందుకు ఉల్లాస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 1,040 మంది వయోజనులను గుర్తించామని, విద్యను అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. త్వరలోనే స్టడీ మెటీరియల్‌ను కూడా అందజేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు వలంటీర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంఈవో బాలాజీనాయక్, ఏపీఎం ఉమాదేవి తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

నందికొట్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. గతంలోలాగ 104 సేవలను పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలన్నారు. 2020 అనంతరం విధుల్లో చేరిన డ్రైవర్, డి.ఇ.వోకు ఉద్యోగ భద్రత కల్పించి, జీవో నెం:7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఇంక్రిమెంట్లు, అరియర్స్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనాలకు ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్‌లు వెంటనే చేయాలని కోరారు. ప్రవీణ్, అబ్దుల్లా, సతీష్, రంగస్వామి, శేఖర్, రేవంత్ పాల్గొన్నారు.

అపరాల సాగుతో భూమి సారవంతం


సాగు విధానం వివరిస్తున్న డీఏవో మురళీకృష్ణ

నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి); అపరాల సాగుతో మినుము, పెసర, అలసంద సాగుతో భూమి సారవంతమవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఏవో ప్రసాదరావు ఆధ్వర్యంలో నంద్యాల మండలం చాబోలు, హైస్కూల్ కొట్టాల, గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ వరి కోత అనంతరం అపరాలను సాగుచేయాలని సూచించారు. రబీలో జొన్నకు కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు ఆశించిందని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వరికి డిసెంబర్ 31లోపు, మిగతా పంటలకు డిసెంబర్ 15 లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఏఈవోలు ముక్తార్‌బాషా, మహేస్. నాగహర్షిత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ప్రజా వైద్యశాల మల్లికార్జున


మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ప్రజా వైద్యశాల మల్లికార్జున

డోన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున అన్నారు. మంగళవారం మచిలీపట్నంలో ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ప్రజా వైద్యశాల మల్లికార్జున, మధుసూదన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేశారన్నారు.

కొత్త పంటలతో అధిక దిగుబడులు

డోన్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫాం సాగు చేసుకోవడంతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నాగరాజు, పట్టు పరిశ్రమల అధికారి పరమేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని చింతలపేట, గోసానిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి వారు మాట్లాడుతూ మామిడి, చీని, ఉల్లి పంటలతో పాటు ఆయిల్ ఫాం పంటలు కూడా వేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ మాట్లాడుతూ రబీ సీజనల్‌లో పప్పుశనగ, జొన్నలు, వేరుశనగ, ఉల్లి పంటలు రైతులు వేసుకొని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీతో పాటు డోన్ ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

శరీర అవయవాల్లో కళ్లు ప్రధానమైనవి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి

కొలిమిగుండ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మనిషి శరీర అవయవాల్లో కళ్లు ఎంతో ప్రధానమైనవని టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల శివాలయంలో రాష్ట్ర మంత్రి బీసీ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు, వాల్మీకి సంఘం నాయకుడు ఉలువల నరసింహుడు సహకారంతో నంద్యాల శాంతిరాం ఆసుపత్రి వారు ఏర్పాటుచేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఐవీ పక్కీరారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా 120మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో 20మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి తిప్పేస్వామి, టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, కోర్నపల్లె నాగిరెడ్డి, ఉప సర్పంచ్ పెద్ద నాగయ్య, నాగార్జున్‌రెడ్డి, చంద్ర, రవి, ఎమ్మార్పీస్ దస్తగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

15న కార్తీక పౌర్ణమి

కొలిమిగుండ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15న కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు ఆలూరు నరసింహప్రసాద్ మంగళవారం వెల్లడించారు. గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో అత్యంత పవిత్రమైన జ్వాలాతోరణం, ఉయ్యాల సేవ, స్వామి వారి గ్రామోత్సవం కార్యక్రమాలతో పాటు, భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రేపు అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ఉయ్యాలవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో ఉమమహేశ్వరరావు మంగళవారం తెలిపారు. శిక్షణకు ప్రజా ప్రతినిధులతో పాటు ఆయశాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హజరు అవ్వాలన్నారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

శిరివెళ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నిరక్షరాసులైన మహిళలను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప పిలుపునిచ్చారు. సెర్ప్, అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శిరివెళ్లలోని మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వలంటీర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధికారి జాకీర్, ఎంఈవో డీటీ శంకర్ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణలత, ఐకేపీ ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయరాదు

కొలిమిగుండ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎంతో విలువైన తాగు నీటిని ప్రజలు వృథా చేయరాదని కొలిమిగుండ్ల సర్పంచ్ జినుగు శివరాముడు అన్నారు. మంగళవారం కాలనీల్లో పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు.

క్యాన్సర్ వ్యాధిపై ఇంటింటి సర్వే

చాగలమర్రి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 14 నుంచి క్యాన్సర్ వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు వైద్యులు ఇమ్రాన్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలకు చెందిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి 18 సంవత్సరాలు నిండిన మహిళల వివరాలను సేకరించి లక్షణాలను బట్టి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

స్థాయి పెరిగినా సౌకర్యాలు కరువు

● వంద పడకల ఆసుపత్రిలో అన్నీ సమస్యలే..
● ఇబ్బందులు పడుతున్న రోగులు

డోన్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గుత్తి రోడ్డులో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. 30 పడకల స్థాయి నుంచి వంద పడకల స్థాయికి ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెంచినా సౌకర్యాలు మాత్రం కరువయ్యాయి. ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రిలో డాక్టర్ల కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో ఇప్పటి వరకు జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, మత్తు ఇంజిక్షన్ ఇచ్చే డాక్టర్ పోస్టులు భర్తీ కాలేదు. కంటి డాక్టరును కూడా ఆసుపత్రిలో నియమించ లేదు. ఆసుపత్రి పర్యవేక్షణకు ఉండాల్సిన సీఎస్ఆర్ఎంవో లేరు. స్టాఫ్ నర్సులు నలుగురు అవసరం కాగా.. ఇంత వరకు ఒక్కరు కూడా లేకపో వడం గమనార్హం. ప్రతి రోజు 400 నుంచి 450 ఓపీ నడుస్తున్న వంద పడకల ఆసుపత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. వివిధ విభాగాలకు సంబంధించిన పరికరాలు లేకపోవ డంతో రోగులకు వైద్యసేవలు అం దడం లేదు. కంటి ఆపరేషన్లకు సంబంధించిన పరికరాలు ఇంతవర కు రాలేదు. ముక్కు, చెవికి సంబంధించిన విభాగాల పరికరాలు లేవు. ఆసుపత్రిలో చేరే రోగులకు సంబం ధించి వారి బంధువులు ఫోన్ సమా చారం చేసుకోవాలన్నా సిగ్నల్ వ్య వస్థ ఇక్కడ సరిగ్గా పని చేయడం లేదు.


ఓపీ తీసుకుంటున్న రోగుల బంధువులు



డోన్ వంద పడకల ఆసుపత్రి

సౌకర్యాలు కల్పించాలి



వంద పడకల ఆసుపత్రిలో ప్రభుత్వం పూర్తి సౌకర్యాలు కల్పించాలి. డాక్టర్ల కొరత లేకుండా చూడాలి. వివిధ విభాగాలకు సంబంధించిన పరికరాలను సమకూర్చి పూర్తి వైద్యసేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావాలి.

- సుబ్బు యాదవ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, డోన్

కొరత వాస్తవమే



వంద పడకల ఆసుపత్రిలో సౌకర్యాల కొరత ఉన్న మాట వాస్తవమే. డాక్టర్ల కొరత, వివిధ విభాగాల సంబంధించి పరికరాలపై సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- హనీఫ్, ఆసుపత్రి సూపరింటెండెంట్, డోన్

పర్యావరణాన్ని కాపాడుకుందాం

బనగానపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గం నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. మంగళవారం బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణంపై అవగాహన కల్పించారు. బనగానపల్లె- నాఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా కళాశాలలోని విద్యార్థులకు ప్లాస్టిక్ క్యారీబాగులు, ప్లాస్టిక్ గ్లాసులు, వస్తువుల వల్ల కలిగే నష్టాలను వివరించింది. బనగానపల్లెను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో విద్యార్థులు, వివిధ వ్యాపారులు, వివిధ వర్గాల ప్రజలతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రపూర్ణ, , టంగుటూరు శ్రీనయ్య, టీచర్ నాగరాజు, అధ్యాపకులు కిశోర్ విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, బనగానపల్లె సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్ మంగళవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మను కలిశారు. ఆయన వెంట ఎస్ఐ దుగ్గిరెడ్డి తదితరులున్నారు. అలాగే మండలంలోని చెర్వుపల్లె గ్రామానికి చెందిన చాకలి సుబ్బరాయుడికి సొంత నిధులతో రూ.3వేలు పింఛన్ అందించారు.


విద్యార్థులతో కలిసి మొక్క నాటి నీరుపోస్తున్న బీసీ ఇందిరమ్మ

బయటి వ్యక్తుల ప్రమేయం సహించం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు



డోన్ రైల్వేస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

డోన్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డోన్ రైల్వే యూనియన్ ఎన్నికల్లో బయటి వ్యక్తుల ప్రమేయం సహించమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు అన్నారు. డోన్ రైల్వే ఉద్యోగి విజయకృష్ణపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం డోన్ రైల్వే స్టేషన్ వద్ద సీపీఐ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మోటరాముడు మాట్లాడారు. రైల్వే ఉద్యోగుల యూనియన్ ఎన్నికల్లో బయటి వారి జోక్యం నివారించాలన్నారు. రైల్వే ఉద్యోగి విజయకృష్ణపై దాడి చేసిన నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పోరుకు సిద్ధం కండి

బేతంచెర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజలపై అధిక భారాలు మోపుతున్న కూటమి ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో రామాంజనేయులు అధ్యక్షతన పట్టణ మూడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బేతంచెర్ల పాతబస్టాండులో భాస్కర్‌రెడ్డి ప్రాంగణలో సీనియర్ నాయకుడు ఎల్లయ్య సీపీఎం జెండా ఆవిష్కరించారు. అలాగే సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు నాగరాజుతో కలిసి రమేష్‌కుమార్ మాట్లాడుతూ పొత్తులతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వ విధానాలను అనుసరిస్తూ పరిపాలన కొనసాగిస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. రూ.17వేల కోట్ల విద్యుత్ చార్జీలు ట్రూఆప్ పేరుతో ప్రజలపై భారం మోపేందుకు సిద్ధంగా ఉందన్నారు. పలు డిమాండ్లపై ప్రభుత్వంపై పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నాయకులు గుల్జార్బీ, నాగేంద్రమ్మ, రామాంజనేయులు, రాజబాబు, వేణుగోపాల్, శ్రీనివాసులు, కోట్ల మధుబాబు, లక్ష్మీదేవి, రమాదేవి, రామతులసి, రమణమ్మ, నారాయణమ్మ, తిరుమలేష్, ఎస్కే భాషా, నారాయణ, విష్ణు, డబ్బాల హుశేన్ చిట్టి, మున్ని తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్

వరుణుడి భయం.. పట్టలే అభయం

చాగలమర్రి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం అల్పపీడన ప్రభావం రైతులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. మంగళవారం మండలంలో వాతావరణం మార్పు రావడం, ఆకాశం నల్లటి మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోతకు ఆలస్యమైన మొక్కజొన్న పైర్లను యంత్రాలతో కోసి ఆరుబయట ప్రాంతాల్లో ఆరబోస్తున్నారు. వర్షం కురిసి ధాన్యం తడిస్తే నష్టపోతామని, పట్టలు కప్పుకునేందుకు పరుగులు తీస్తున్నారు. పండిన పంటలకు ధరలు లేక గత నెలలో కురిసిన తుపాన్‌కు నష్టపోయామని, తిరిగి తుపాన్ ప్రభావం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.


శెట్టివీడు రహదారిలో మొక్కజొన్న ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు


రుద్రవరంలో వరిధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

రుద్రవరం : బంగాళాఖాతంలో తుపాను హెచ్చరికలు జారీకావడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మంగళవారం రుద్రవరం మండలంలో చినుకులు రాలడంతో రైతులు మొక్కజొన్నలు, పంట కుప్పలపై కవర్లు కప్పారు. తుపాను ప్రభావంతో చేతికందిన పంట దెబ్బతింటుందో రైతులు ఆందోళన చెందారు. ఏదిఏమైనా తుపాను హెచ్చరికతో రైతుల్లో అలజడి ప్రారంభమైంది. ఒక వైపు వరికోతలు, మరో వైపు మొక్కజొన్న కోతలు కొనసాగుతున్నాయి.

ఇరువర్గాలపై కేసు నమోదు

శిరివెళ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రెండు వర్గాల మధ్య ఈ నెల 10న ఘర్షణ నెలకొన్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య మంగళవారం తెలిపారు. ఈ ఘటనలో లింగన్న ఫిర్యాదు మేరకు ప్రసాద్, సురేష్, రాజుపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే ప్రసాద్ ఫిర్యాదు మేరకు లింగన్న, జయపాల్, రమణయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇరు వర్గాల మధ్య ఉన్న మనస్పర్థలు ఈ ఘర్షణకు దారితీసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు హౌస్‌హోల్డ్ జియో ట్యాకింగ్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌డీవో శివారెడ్డి సూచించారు. మంగళవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 15 నాటికీ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణకు కసరత్తు

ఉయ్యాలవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నామని తహసీల్దారు శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 15 సాగునీటి సంఘాలు ఉండగా 11 సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో 4,555 మంది రైతులు ఓటర్లుగా ఉన్నారన్నారు. ఈ నెల 23వ తేదీన బహిరంగ ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. మండలంలోని గ్రామాల్లో సాగునీటి సంఘం ఓటర్ల జాబితాను సిద్ధంగా ఉంచామని తహసీల్దారు తెలిపారు. రైతు ఓటర్ల జాబితాను ఆయా గ్రామాల సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో అంటించామన్నారు. ఓటర్ల జాబితాపై అనుమానాలు, ఫిర్యాదులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు.

16 సాగునీటి సంఘాలకు 2281 మంది ఓటర్లు

రుద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ నెల 23న సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు మల్లిఖార్జున మంగళవారం తెలిపారు. 16 చెరువులకు ఈ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. వీటిలో మహిళా ఓటర్లు 635 మంది, పురుష ఓటర్లు 1646మంది మొత్తం 2281 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. చెరువుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేశామని తహసీల్దారు తెలిపారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చాగలమర్రి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చాగలమర్రి గ్రంథాలయ అధికారి రామచంద్రుడు మంగళవారం తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హెచ్‌ఐవీ ప్రాణాంతకం కాదు

ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం



డోన్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ సోకిన వారు నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకంగా మారుతుందని ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం అన్నారు. హెచ్‌ఐవీ సోకిన వారు సరైన వైద్యం పొందుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల దీర్ఘకాలికంగా జీవించే అవకాశం ఉంటుందన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ పరిధిలో ఏయే మండలాలు ఉన్నాయి..?

జవాబు: డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల మండలాలు ఉన్నాయి.

ప్రశ్న: ఏయే మండలాల్లో కేసులు నమోదవుతున్నాయా..?

జవాబు: ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాల్లో హెచ్‌ఐవీ కేసులు నమోదవుతున్నాయి.

ప్రశ్న: హెచ్‌ఐవీ లక్షణాలు, వాటి నివారణ చర్యలు వివరించండి..?

జవాబు: జ్వరం, తలనొప్పి, ఒళ్లంతా దద్దుర్లు, గొంతు నొప్పితో పాటు వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలి. హెచ్‌ఐవీ సోకిన వారిలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయి పూర్తిగా బలహీనపడటం జరుగుతుంది. హెచ్‌ఐవీ సోకిన వారు దగ్గరలో ఉన్న ఏఆర్‌టీ కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఉచితంగా ఏఆర్‌టీ మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. హెచ్‌ఐవీ సోకిన వారు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

ప్రశ్న: హెచ్‌ఐవీ సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: జీవిత భాగస్వామితో మాత్రమే లైంగిక సంబంధం కొనసాగించాలి. విచ్చలవిడి శృంగారం సుఖవ్యాధులకు దారి తీస్తుంది. ఇవి ఉన్నవారికి హెచ్‌ఐవీ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రక్తం అవసరమైనప్పుడు గుర్తింపు పొందిన బ్లడ్‌బ్యాంక్‌ల నుంచి మాత్రమే రక్తం తీసుకోవాలి. సెలూన్స్‌కి వెళ్లినప్పుడు కొత్త బ్లేడ్ వాడాలన్ని గుర్తుపెట్టుకోవాలి.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నిక

బనగానపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బనగానపల్లె నియోజకర్గం ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సహాయ ఎన్నికల అధికారిగా సునీల్‌కుమార్, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, ఉపాధ్యక్షుడు పక్రుద్దీన్ వ్యవహరించారు. బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా బిచ్చయ్య, కార్యదర్శిగా చంద్రశేఖర్, సహాధ్యక్షురాలిగా డాక్టర్ సుజాత, కోశాధికారిగా నవీన్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా జయరాంనాయక్, ముక్తార్, హరినాథ్, షర్మిల, సురేశ్ బాబు, అబ్దుల్‌కలీం, సంయుక్త కార్యదర్శులుగా నాగసురేంద్ర బాబు, కమలహాసన్, చరణ్ , ఈశ్వరప్రసాద్, అబ్దుల్‌రహీం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు రాష్ట్ర అధ్యక్షుడిగా సూర్యనారాయణను బలపరుస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు


నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

డోన్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డోన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ వరలక్ష్మి హెచ్చరించారు. కొత్తపేటలో నాటుసారా విక్రయిస్తున్న మహిళ సుంకులమ్మ నుంచి 30 లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే ప్యాపిలి పట్టణంలో పుల్లసి సుంకమ్మ నాటుసారా విక్రయిస్తుండగా.. దాడులు నిర్వహించి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రేతలపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐలు సోమశేఖర్ రావు, దౌలత్ ఖాన్, మారుతి ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

డోన్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సువర్ణకాలనీకి చెందిన నాగమోహన్ రెడ్డి అనే యువకుడిపై కొందరు వ్యక్తులు స్థల వివాదంలో దాడి చేసి గాయపరిచారు. దాడికి గురైన నాగమోహన్ రెడ్డిని మెరుగైన చికిత్స కోసం బంధువులు కర్నూలు తరలించారు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులు విచారిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బనగానపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వవైద్యశాలలో గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. సుమారు 30 సంత్సరాల వయస్సుగల వ్యక్తి కొంతకాలంగా భిక్షాటన చేసుకుంటూ తిరిగేవాడని, బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాల వద్ద మృతి చెందాడు. టీషర్టు వేసుకొని ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. మృతి చెందిన విషయాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది గ్రామ పంచాయతీ అధికారులకు తెలియజేశారు.

రేపు ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ

కోవెలకుంట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ఈనెల 14న ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2025-26 సంవత్సరం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం, ప్రణాళిక తయారు చేయడం కోసం వార్షికబడ్జెట్ కోవెలకుంట్ల పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అన్నిశాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలన్నారు.

'బడ్జెట్‌లో దివ్యాంగులకు అన్యాయం'

కోవెలకుంట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం 2024-25 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగులను పూర్తిగా విస్మరించిందని నంద్యాల జిల్లా దివ్యాంగుల జేఏసీ అధ్యక్షుడు దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని కొండారెడ్డి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో దివ్యాంగులకు జీరో కేటాయించి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

శిరివెళ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయు డు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టుపై ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య మంగళవారం తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడ పట్టణానికి చెందిన శ్యామ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో అసభ్యకర, అనుచిత పోస్టులు చేసినట్లు గుర్తించిన ఐ-టీడీపీ స్పోక్ పర్సన్ గొండా యూనుస్ బాషా ఫిర్యాదు చేయడంతో చట్టపరంగా అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.